అతిసారం బాధితులకు మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న పద్మావతి, భాస్కరరావు

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారం బారిన పడిన వారికి స్థానికంగానే శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టరు పద్మావతి తెలిపారు. శనివారం స్థానికంగా ఆమె మాట్లాడారు. చిన్నపిల్లలను విజయనగరంలోని ఘోషాసుపత్రికి పంపించామన్నారు. 123 మంది వైద్యులు, సిబ్బంది నిరంతరం సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, వైద్యాధికారి చెన్నయ్య ఉన్నారు.

అండగా ఉంటాం: ఎంపీ

గుర్ల, న్యూస్‌టుడే: అతిసారం నివారణపై యంత్రాంగం దృష్టిసారించిందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. కేసుల నమోదు, మరణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. వ్యాధి తగ్గే వరకు మెరుగైన వైద్యం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాజకీయాలు మాట్లాడేందుకు ఇది సరైన సమయం కాదన్నారు. నాయకులు వి.సన్యాసినాయుడు, జి.రామునాయుడు, ఎం.అప్పలనాయుడు, వి.శ్రీనివాసరావు, సంతోష్ తదితరులున్నారు.


రోగులను పరామర్శిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

భక్తిశ్రద్ధలతో సిరిమాను తరలింపు

తెప్పోత్సవానికి రేపు ప్రాథమిక పరిశీలన

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం అనంతరం చదురుగుడి ఆలయం వద్ద భక్తుల దర్శనార్థం ఉంచిన సిరిమానును శనివారం కొత్తపేట తరలించారు. ఉదయం 6.30 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం దీక్షాధారులు తల్లి శరణఘోష నడుమ ఈ కార్యక్రమాన్ని సంప్రదాయంగా చేపట్టారు. శివాలయం వీధి, పార్కుగేటు, మండపం, సుద్దవీధి మీదుగా తీసుకెళ్లి.. కొత్తపేట మండపం సమీపంలోని రాజ్‌గోపాల్ పెండ్రిస్‌లో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా దారిపొడవునా భక్తులు సిరిమానును ఆరాధించారు. తల్లి సేవకులు, దీక్షాధారులు, హుకుంపేట వాస్తవ్యులు పాల్గొన్నారు.


చదురుగుడి నుంచి తీసుకెళ్తున్న భక్తులు

చెరువులోకి దిగిన తెప్ప..

అమ్మవారి పండగ అనంతరం వచ్చే మంగళవారం పెద్ద చెరువులో తెప్పోత్సవం జరగనుంది. ఇందులో భాగంగా గాడీఖానా సమీపంలోని ఒడ్డున అమ్మవారు విహరించే తెప్పను వడ్రంగులు నాలుగు రోజులుగా తయారు చేస్తున్నారు. శుక్రవారానికి పనులు పూర్తికాగా.. శనివారం జేసీబీ సాయంతో చెరువులోకి దించారు. సోమవారం ప్రాథమిక పరిశీలన అనంతరం, మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని దేవస్థానం సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు.


జేసీబీతో లోపలికి నెడుతున్న దృశ్యం

అర్హులారా.. అందుకోండి పింఛను

అర్హులైన వారికి పింఛన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. డిసెంబరు నాటికి ఎంపికలు పూర్తి చేసి, వచ్చే ఏడాది జనవరి నుంచి నగదు అందించేందుకు ప్రణాళిక వేసింది. అందులో భాగంగా దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిపొందిన వారి వివరాలు సేకరించాలని సూచించింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు కసరత్తు ప్రారంభించారు.



– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

ప్రస్తుతం 14 రకాల పింఛన్లు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 4.13 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. వీరి వివరాలను మరోసారి పరిశీలించనున్నారు. ముఖ్యంగా గత అయిదేళ్లలో నమోదైన వారి దస్త్రాలను తనిఖీ చేయనున్నారు. రెండు జిల్లాల్లో 49,622 మంది దివ్యాంగులకు పింఛను అందుతోంది. వీరిలో 100 మంది వరకు నిబంధనలకు విరుద్ధంగా నగదు తీసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈమేరకు నోటీసులు సైతం అందించారు. ఇలాంటి వారిని ప్రత్యేక పరిశీలన అనంతరం తొలగించనున్నారు. అర్హులని తేలితే కొనసాగిస్తారు. మరోవైపు కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నారు.

50 రోజుల ప్రణాళిక

నవంబరు నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ నెలలోనే తనిఖీలు చేపడతారు. అర్హులు, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. గ్రామ సభల దృష్టికి తీసుకెళ్తారు. అభ్యంతరాలొస్తే పరిశీలించి, సరిచేస్తారు. డిసెంబరు నెలాఖరు నాటికి ఎంపికలు పూర్తిచేయనున్నారు. 50 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ ప్రక్రియ సాగనుంది.


క్షేత్రస్థాయిలో పింఛన్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్న సచివాలయ సిబ్బంది

10 వేల మందికి పైనే..

గత ప్రభుత్వ హయాంలో.. అర్హులై, పింఛను కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో సుమారు 10 వేల మందిని పక్కన పెట్టారు. అప్పటి నాయకులు చెప్పిన వారినే లబ్ధిదారులుగా పరిగణించారనే ఆరోపణలున్నాయి. అలాగే రెండు జిల్లాల్లో 3,400 మంది దివ్యాంగులకు పింఛన్లు ఆపేశారు. వీరు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. వీరందరికీ ఇప్పుడు అవకాశం కలగనుంది. క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది దరఖాస్తులు తీసుకుంటున్నారని, పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు.

ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ

కొత్తవారికి జనవరి నుంచి మంజూరు

'కొత్త సదరం ధ్రువపత్రం పొందాలనుకునే వారు ముందుగా సచివాలయాలను సంప్రదించాలి. ఆధార్, చరవాణి నంబరు తప్పనిసరి. ఓటీపీ ఆధారంగా వివరాలను నమోదు చేస్తారు. పరిశీలనకు గానూ జిల్లా, ప్రాంతీయాసుపత్రులు, నిపుణులున్న సీహెచ్‌సీలను కేటాయిస్తారు. అక్కడ తనిఖీల అనంతరం ధ్రువపత్రాలను సచివాలయాలకు పంపిస్తారు. అక్కడికి వెళ్లి తీసుకోవచ్చు. డిసెంబరు 25 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది'

వినతులు స్వీకరించి.. భరోసా కల్పించి



లోకేశ్‌ను కలిసిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం విశాఖలోని తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన పలువురు మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఎలాంటి ఆధారం లేని తమకు టిడ్కో ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని విజయనగరం జిల్లా బొద్దూరుకు చెందిన వావిలపల్లి హేమలత కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్‌లో తనకు ఉద్యోగావకాశం కల్పించాలని వావిలపల్లి వేణుగోపాలరావు విజ్ఞప్తి చేశారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని 1998 టీచర్స్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు.

లోకేశ్.. మాపాలిట దేవుడు..

తమ కుమారుడు వావిలపల్లి చైతన్యనాయుడిని ఇంటికి తిరిగి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్న మంత్రి నారా లోకేశ్ తమ పాలిట దేవుడిలా నిలిచారని బొద్దూరుకు చెందిన వావిలపల్లి వేణుగోపాలరావు, హేమలత దంపతులు తెలిపారు. ఈ మేరకు లోకేశ్‌ను కలిసి ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కూలిపనులు చేసుకుంటూ జీవించే వేణుగోపాలరావుకు ముగ్గురు అబ్బాయిలు. మూడో సంతానమైన చైతన్యనాయుడు బంధువుల ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నిప్రయత్నాలు చేసినా ఆచూకీ తెలియలేదు. చివరికి విజయవాడలో జరిగిన ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా గాలించి హైదరాబాద్‌లో ఉన్న చైతన్యనాయుడిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

వరద బాధితులకు రూ.4 లక్షల ఆర్థిక సాయం


సీఎం చంద్రబాబు నాయుడుకు చెక్కు అందిస్తున్న యడ్ల గోపాలరావు

రాజాం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల గోపాలరావు రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబునాయుడును కలిసి చెక్కు అందజేశారు. దీంతో పాటు అఖిల ప్రజా కళాకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులో నాటికను ఏర్పాటు చేసి సేకరించిన రూ.2 లక్షల విరాళాలను కళాకారులతో కలిసి అందజేసినట్లు చెప్పారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కేజీబీవీల్లో బోధన, బోధనేతర (అకౌంటెంట్, వార్డెన్ పోస్టులకు మాత్రమే) పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఆదివారం ధ్రువపత్రాల పరిశీలన జరగనుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్హత ధ్రువపత్రాలు, నకళ్ల కాపీలు, ఆన్‌లైన్ ఫారం జిరాక్స్ కాపీతో ఉదయం 9.30 గంటలకు దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు రావాలని సూచించారు.

సాగునీటి సంఘాలకు మంచి రోజులు

గజపతినగరం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి సరఫరాకు ఒక్క రూపాయి విదల్చకపోవడంతో రైతులు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. కాలువలకు పడిన గండ్లు, చెరువుల మదుములు, సబటాల మరమ్మతులు తదితర సమస్యలను గాలికి వదిలేయడంతో ఇబ్బందులు వెంటాడాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నీటివనరుల అభివృద్ధిపై దృష్టిసారించింది. గతంలో ఏర్పాటైన సాగునీటి సంఘాలు అయిదేళ్లలో అచేతన స్థితికి చేరుకోగా.. వాటిల్లో కదలిక తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రస్తుతం సంఘాల ఓటర్ల జాబితాల పరిశీలన చేపట్టింది.


గజపతినగరం నీటిపారుదల శాఖ కార్యాలయం

ఈ ఊసే లేదు..

విజయనగరం డివిజన్ పరిధిలో 246 సంఘాలు ఉండగా వీటి పరిధిలో 69,066 ఎకరాల్లో ఆయకట్టు సాగవుతోంది. వీటి పరిధిలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, సంబంధిత పాలక వర్గాలతో కావాల్సిన పనులు చేయించేందుకు ప్రతిపాదనలు, ఆపై వారి భాగస్వామ్యంతో నిర్వహణ.. తదితర ప్రక్రియలు గతంలో జరిగేవి. దీనివల్ల సాగునీటి సమస్యలు, కాలువల ఆక్రమణలు, అక్రమాలకు తావు ఉండేది కాదు. వైకాపా వచ్చాక.. వాటన్నింటినీ పక్కనెట్టేసింది.

గాడిలో పెట్టేందుకు..

సంఘాలను గాడిలో పెట్టేందుకు వాటి పరిధిలోని ఓటర్ల జాబితాల్లో చనిపోయిన వారిని, భూక్రయ విక్రయాల ద్వారా ప్రస్తుతం సాగుదారులను జాబితాల్లో చేర్పించే ప్రక్రియ జరుగుతోంది. నిధులు సమీకరించేందుకు అన్నదాతల నుంచి నీటి తీరువా వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మూణ్రోజులుగా గ్రామాల్లో వీఆర్వోలు మార్పులు, చేర్పులు చేస్తున్నారు.

సిద్ధం చేస్తున్నాం..: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల వివరాలను పరిశీలిస్తున్నాం. వాటి మార్పునకు కసరత్తు జరుగుతోంది. జలం ఆధారంగా సంఘాల వివరాలను ఉన్నతాధికారులకు పంపించేందుకు సిద్ధం చేస్తున్నాం. **- గోవిందరావు, డీఈఈ, జలవనరులశాఖ**

విజయనగరం డివిజన్‌లో ఆయకట్టు ఇలా..

మండలం	సంఘాలు	ఎకరాల్లో
గజపతినగరం	11	2,973
బొండపల్లి	11	2,105
గంట్యాడ	17	3,898
దత్తిరాజేరు	19	4,734
మెంటాడ	11	2,825
ఎస్.కోట	19	7,052
కొత్తవలస	9	1,440
జామి	14	5,542
వేపాడ	26	5,833
ఎల్.కోట	18	5,339
నెల్లిమర్ల	14	2,542
పూసపాటిరేగ	8	5,899
భోగాపురం	2	1,225
డెంకాడ	8	1,427
విజయనగరం	13	3,218
చీపురుపల్లి	11	2,353
గరివిడి	13	2,784
మెరకముడిదాం	11	2,042
గుర్ల	11	5,835

పెందుర్తి- బౌడరా రయ్‌రయ్

కొత్తవలస, న్యూస్‌టుడే: విశాఖ- అరకు మార్గంలో పెందుర్తి- బౌడరా మధ్య ఎన్‌హెచ్-516బి విస్తరణకు మోక్షం లభించింది. పెందుర్తి నుంచి కొత్తవలస, శృంగవరపుకోట మీదుగా బౌడరా వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును నాలుగు వరుసలుగా మార్చేందుకు కేంద్ర రహదారులు, రవాణా శాఖ ఎట్టకేలకు పచ్చజెండా ఊపింది. గతంలో భారతమాల పరియోజన కింద అనుమతులు మంజూరైనప్పటికీ టెండరు ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని జాతీయ రహదారుల ఆవశ్యకతపై కేంద్రంతో చర్చించడంతో కదలిక వచ్చింది.


విశాఖ-అరకు జాతీయ రహదారి

రూ.956.21 కోట్లతో విస్తరణ..

కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపుకోట మండలాల మీదుగా ఈ రహదారి వెళుతోంది. జిల్లాలో కొత్తవలస మండలం చింతలపాలెం నుంచి శృంగవరపుకోట మండలం బౌడరా వరకు ప్రస్తుతమున్న 7 మీటర్ల వెడల్పును 11 మీటర్లకు పెంచుతారు. 40.5 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డును రూ. 956.21 కోట్లతో విస్తరించనున్నారు. ఈమేరకు 118.508 హెక్టార్ల భూమిని సేకరిస్తున్నారు.

మూడు చోట్ల బైపాస్‌లు

పట్టణ ప్రాంతాలైన కొత్తవలస, శృంగవరపుకోట మీదుగా విస్తరిస్తే నష్టం ఎక్కువగా ఉంటుంది. దీన్ని నివారించడానికి 17.8 కి.మీ. మేర బైపాస్ రోడ్లను ప్రతిపాదించారు. చింతలపాలెం నుంచి మంగళపాలెం, ఎం.ఆర్.పురం, గవరపాలెం, సీతంపేట, తుమ్మికాపల్లి, అడ్డూరువానిపాలెం, నిమ్మలపాలెం మీదుగా 11 కి.మీ. పొడవున ఒకటి, వెంకటరమణపేట నుంచి 6 కి.మీ. పొడవున మరొకటి, బౌడరా కూడలికి సమీపంలో ఇంకోటి రానుంది. రెండు, మూడు రోజుల్లో టెండరు తెరవనున్నారు. దీని ఖరారు ప్రక్రియ పూర్తవడానికి మూడు, నాలుగు నెలలు పడుతుంది. భూసేకరణ జరగాల్సి ఉంది. కేంద్రం ఆమోదంతో నిధులు విడుదలైతే పనులు ప్రారంభిస్తామని ఎన్‌హెచ్ అధికారులు తెలిపారు.

ఇదేం దోపిడీ?

తవ్విన చోటే గ్రావెల్‌ను వినియోగించాలి.. వేరొక చోటకు తరలించాలంటే ప్రభుత్వానికి రవాణా, సీనరేజీ ఛార్జీలు చెల్లించాలి.. కానీ కొందరు గుత్తేదారులు ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు గనులు, భూగర్భ శాఖ అధికారులు గుర్తించారు. విజయనగరంలోని జాతీయ రహదారిపై ద్వారపూడికి వెళ్లే మార్గం వద్ద రైల్వే వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అక్కడ తవ్విన గ్రావెల్‌ను వేరే చోటుకు తరలిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడింది. ఈమేరకు రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు గనుల శాఖ విజిలెన్స్ స్క్వాడ్ మల్లేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు.



జరుగుతున్న రైల్వే పనులు

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

కొండకో గొడుగు

పచ్చని కొండ.. దానిపై గొడుగులా పరచుకున్న తెల్లని మేఘం.. చూడముచ్చటగా ఉన్న ఈ దృశ్యం కనువిందు చేసింది. గజపతినగరం మండలం మరుపల్లి గ్రామ సమీపంలో శనివారం ఉదయం ఆరు గంటలకు కనిపించిన ఈ ప్రకృతి అందాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. రెండు గంటల పాటు మేఘం చెదిరిపోకుండా అలానే ఉండటం విశేషం.

– న్యూస్‌టుడే, గజపతినగరం



– న్యూస్‌టుడే, విజయనగరం వైద్య విభాగం

అత్యాధునికం.. అనుమతులే జాప్యం

నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అవసరమైతే మేమున్నామంటూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకు వస్తోంది. ఇప్పటి వరకు లక్షలాది మందికి సేవలు అందించింది. అయితే ప్రస్తుత అవసరాలు, రక్త వినియోగం నేపథ్యంలో అత్యాధునిక సేవలను అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. ఈమేరకు రూ.కోట్ల విలువైన పరికరాలను సమకూర్చుకుంది. అయితే కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడంతో బ్లడ్ కాంపోనెంట్ యూనిట్, సింగిల్ ప్లేట్ డోనార్ యూనిట్లు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

ఉమ్మడి జిల్లాలో ధరలు ఇలా..(రూ.లలో)		
అంశం	రెడ్‌క్రాస్	ప్రైవేటు
హోల్ బ్లడ్	800	1,200- 1,450
ప్యాకెట్ సెల్స్	-	1,200- 1,450
ప్లాస్మా	-	600- 1,000
ప్లేట్‌లెట్లు	-	1,000- 1,450
సింగిల్ డోనార్	-	12,000- 14,000

మార్పులు ఇలా..

ప్రస్తుతం హోల్ బ్లడ్(రోగికి అవసరమైన రక్తాన్ని ప్యాకెట్ల రూపంలో అందించడం) సేవల్లో సొసైటీ ముందుంది. అయితే కొన్నిసార్లు గ్రూపుల్లో తేడాలు వచ్చాయన్న ఆరోపణలున్నాయి. ప్రైవేటు కేంద్రాలపైనా ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త యూనిట్లను ప్రారంభించనుంది. అందులో భాగంగా రెండేళ్ల కిందటే విలువైన పరికరాలు వచ్చాయి. కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తనిఖీలు చేసి, సంతృప్తి సైతం వ్యక్తం చేసింది. అయితే ఇంతవరకు అనుమతులు రాలేదు.


అందుబాటులో రూ.కోట్ల విలువైన పరికరాలు

ఉపయోగాలివీ..

మనిషి నుంచి సేకరించిన ఒక యూనిట్ రక్తం అనేక రకాల సేవలకు ఉపయోగపడుతుంది. హోల్ బ్లడ్, ప్యాకెట్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్‌లెట్లు, సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్లు.. తదితర విధాలుగా వినియోగించవచ్చు.

- ★ రోడ్డు ప్రమాద బాధితులు, గర్భిణులు, బాలింతలు, శస్త్రచికిత్సల సమయంలో హోల్ బ్లడ్‌ను ఉపయోగిస్తారు.
- ★ రోగి వేగంగా కోలుకునేందుకు ప్యాకెట్ సెల్స్ అవసరం.
- ★ అరుదైన సమయాల్లో ప్లాస్మా వాడతారు.
- ★ డెంగీ బాధితులకు ప్లేట్‌లెట్లు, ఎక్కిస్తారు.
- ★ అత్యవసర వేళల్లో సింగిల్ డోనార్ ప్లేట్‌లెట్లు వినియోగిస్తారు.
- ★ కొత్త యూనిట్లు అందుబాటులోకి వస్తే ఈ సేవలన్నీ అందనున్నాయని, ఎలాంటి ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. అలాగే తక్కువ ధరలకే సేవలను అందించవచ్చని పేర్కొంటున్నారు.

వారికి ఉచిత సేవలు..

2006 నుంచి 2023 డిసెంబరు నెలాఖరు వరకు 57,718 యూనిట్లు సేకరించాం. ఇందులో 30 శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు ఇచ్చాం. క్యాన్సర్, తలసేమియా, సికిల్ సెల్ రోగులతో పాటు గిరిజనులు, నిరుపేద వర్గాల వారికి ఉచితంగా అందిస్తున్నాం. బ్లడ్ కాంపోనెంట్, సింగిల్ ప్లేట్ డోనార్ యూనిట్లు ప్రారంభమైతే సేవలు మరింత మెరుగుపడనున్నాయి. చీపురుపల్లిలోనూ బ్లడ్ బ్యాంక్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. **- ప్రసాదరావు, ఛైర్మన్, కె.సత్యం, కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ**

21 నుంచి ఇంటర్ పరీక్షలకు రుసుము చెల్లింపు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేటు, హాజరు మినహాయింపు పొందిన విద్యార్థులు 21వ తేదీ నుంచి నవంబరు 11లోగా కళాశాలలో ఫీజు చెల్లించాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1000 అపరాధ రుసుముతో చెల్లించడానికి నవంబరు 20 వరకు అవకాశముందని పేర్కొన్నారు. ఆర్ట్స్, హ్యుమానిటీస్ అభ్యర్థులు https://bieV2.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని, నవంబరు 15లోగా హాజరు మినహాయింపు కోసం రూ.1500 ఫీజు చెల్లించాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాల ప్రధానాచార్యులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్‌లెస్)	డ్రెస్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	137	244	254

నైపుణ్యం పట్టు.. ఉపాధికి మెట్టు

న్యూస్‌టుడే – రాజాం

● వరంగా పీఎం ఇంటర్న్‌షిప్ పథకం
● దరఖాస్తులకు ఈనెల 25వరకు గడువు

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు నైపుణ్యం అత్యంత కీలకం. ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఉద్యోగాలు కల్పనలో ప్రాధాన్యత ఉన్నాయి. ఇప్పటికే చదువులు పూర్తిచేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరంగా ఉన్న యువతకు కేంద్రం ఊతమిస్తోంది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కింద అభ్యర్థులను ఎంపిక చేస్తోంది. దీనికి సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 12 నుంచి అవకాశం కల్పించింది. దేశంలోని 500 అగ్రగామి కంపెనీల్లో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేసింది. గతంలో కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌తో కూడిన నియామకాలు 10 శాతం వరకు ఉండగా.. ఇప్పుడు 60 – 70 శాతానికి పైగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. మరికొన్ని కంపెనీలు ఇంజినీరింగ్ నాలుగో ఏడాది చదివే సమయంలోనే శిక్షణ పూర్తిచేస్తున్నాయి. జిల్లాలో ఏటా బీటెక్, డిగ్రీ, డిప్లొమా ఇతర డిగ్రీలు పూర్తిచేస్తున్న వారు 20 వేల మందికి పైగా ఉంటున్నారు.

ఏడాదిలో రూ.66 వేలు..

ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెల రూ.5 వేలు చొప్పున అందిస్తారు. ఏక కాల గ్రాంటు కింద మరో రూ.6 వేలు కూడా ఇస్తారు. మొత్తంగా రూ.66 వేలు సమకూరుతుంది. www.pminternship.mca.gov.in అనే ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేయాలి. ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, బయోడేటా నమోదు చేసుకోవాలి. చిరునామా, వ్యక్తిగత వివరాలు, ఈ మెయిల్‌ఐడీ, విద్యార్హతలు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర వాటిని పొందుపర్చాలి. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. 26న జాబితా ప్రకటిస్తారు. 27 నుంచి నవంబరు 7 వరకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది. ఎంపికైన అభ్యర్థులు 8 - 15 లోగా అంగీకారం తెలపాలి. ఇంటర్న్‌షిప్‌లు డిసెంబరు 2న ప్రారంభమవుతాయి.

21 - 24 ఏళ్ల వారు అర్హులు

ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునేందుకు 21-24 ఏళ్ల యువత అర్హులు. కుటుంబంలో ఏ ఒక్కరి ఆదాయం రూ.8 లక్షలు దాటినా అనర్హులే. సీఏ, ఎంబీబీఎస్, ఎంబీఏ వంటి ఉన్నత డిగ్రీలతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఐఐటీ తదితర ఉన్న విద్యా సంస్థల్లో చదివిన వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.13.74 లక్షలు

పాలకొండ, న్యూస్‌టుడే: కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం పోలీసుల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించారు. రూ.13,74,102 నగదు, 11.5 గ్రాముల బంగారం, 470 గ్రాముల వెండి లభించింది. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్.రామారావు, కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ, ప్రధానార్చకులు బుజ్జిబాబు పర్యవేక్షణలో అమ్మవారి కానుకల లెక్కింపు కార్యక్రమం సాయంత్రం వరకు జరిగింది.


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పైడితల్లి అన్నదానానికి విరాళం


దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలకు చెక్కు అందజేస్తున్న విశ్వేశ్వరరావు

ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితల్లి అమ్మవారి అన్నదానానికి విశాఖకు చెందిన విశ్వేశ్వరరావు రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక చదురుగుడిలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలుకు చెక్కు రూపంలో మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా దాతకు తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

నైపుణ్యాభివృద్ధికి ఉచిత శిక్షణ

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), ప్రొడక్ట్ ఎండొరర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఈడీ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృత్యువాత

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శనివారం కోళిపాటి కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా ఆనందపురం ప్రాంతానికి చెందిన ఎస్.వెంకటరమణ (33) విద్యుత్తు పనుల నిమిత్తం ఒక ఇంటికి వచ్చారు. నిచ్చెన ఒకవైపు నుంచి మరో దగ్గరికి తీసుకుని వెళ్తుండగా 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలి వెంకటరమణ అక్కడికక్కడే చనిపోయారు. అతని వెంట వచ్చిన బి.సూర్యారావు గాయపడ్డారు. మృతుని భార్య అమ్మత సుఖ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో పట్టణ ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

కుటుంబ సమస్యలతో యువకుడి బలవన్మరణం

మెరకముడిదాం, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దత్తిరాజేరు మండలం ఎం.లింగాలవలస చెందిన ఎస్.అప్పలనాయుడు(26) కొంత కాలంగా మెరకముడిదాం మండలం చెల్లారులో చెందిన వెంకటప్పలనాయుడు వద్ద ట్రాక్టరు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి వచ్చి.. యజమానికి చెప్పి మద్యానికి వెళ్లిపోయారు. పతివానిపేట సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు, బుదరాయవలస పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఎస్సై లోకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కడుపునొప్పి తాళలేక ఇంటిపెద్ద ఆత్మహత్య

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక నెల్లిమర్లలో ఓ ఇంటిపెద్ద ఆత్మహత్య చేసుకున్న ఘటన వీటి అగ్రహారం మధ్యపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వంట మనిషిగా చేసే జోగా జగన్నాథం (35) కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. చికిత్స చేయించినా కూడా పొందుతున్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సమీపంలోని నేలబావిలో శవమై తేలారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై రేవతి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

ఎస్.ఆర్‌పురం(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలం పైడిభీమవరం పంచాయతీలోని ఓ ఫార్మా కంపెనీ సెజ్‌లో పనిచేస్తున్న పి.చిన్నంనాయుడు(33) అనుమానాస్పద స్థితిలో పరిశ్రమలో శనివారం మృతి చెందారు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బొండపల్లి మండలం బి.రాజేరుకు చెందిన చిన్నంనాయుడు ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ పనిచేస్తున్నారు. శనివారం విధులకు హాజరై, పనిచేస్తుండగా స్పృహ కోల్పోవడంతో అంబులెన్స్‌లో విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్మికుడి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని పరిశ్రమ వద్దకు తీసుకొస్తుండగా కంపెనీ గేటు వద్ద జేఆర్‌పురం పోలీసులు అడ్డగించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సుమారు 5 గంటల పాటు పరిశ్రమ వద్ద ఆందోళన చేశారు. యాజమాన్యం రాత్రి పరిహారం అందేలా నిర్ణయించి కుటుంబ సభ్యులను ఆదుకుంటున్నారు. చిన్నంనాయుడి తండ్రి సూరి ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా క్రికెట్, హాకీ, త్రోబాల్ ఎంపికలు

విజయనగరం క్రీడలు, న్యూస్‌టుడే: విజ్జీ మైదానంలో శనివారం క్రికెట్, హాకీ జట్ల ఎంపికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. అండర్-17 బాలుర కల క్రికెట్ జట్టు ఎంపికలకు 150 మంది క్రీడాకారులు తరలివచ్చారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన 16 మంది రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని స్కూల్ గేమ్స్-17 కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అభినందించారు. ఇదే మైదానంలో హాకీ, త్రోబాల్ ఎంపికలు జరిగాయి. వీరిలో బాగా రాణించిన వారిని రాష్ట్ర జట్లకు ఎంపిక చేసినట్లు కృష్ణంరాజు తెలిపారు.


రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: రెడ్డీస్ ల్యాబొరేటరీ ఇండియా ప్రై.లిమిటెడ్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, విశాఖపట్నం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఇండియా ఎండీ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం మహారాజా డిగ్రీ కళాశాలలో 22న పురుష అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్లలోపు వయసు, బీఎస్సీ (కెమిస్ట్రీ), డిప్లొమా(ఈఈఈ, ఈసీఈ, మెకానిక్), ఐటీఐ విద్యార్హత ఉండాలన్నారు. 2020-2024 విద్యా సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు 70939 47321 నంబరును సంప్రదించాలని సూచించారు.

బొబ్బిలి

•బొబ్బిలి •రాజాం •గజపతినగరం •చీపురుపల్లి

మురుగు కూపం.. వ్యర్థాలమయం



చీపురుపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కాలువ వ్యర్థాలతో నిండిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. వర్షాలు పడితే రహదారిపైకి చేరుతోందని పలువురు చెబుతున్నారు. పక్కనే ఉన్న గుర్లలో అతిసారంతో ప్రజలు మంచం పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కాలువలు శుభ్రం చేయిస్తామని పారిశుద్ధ్య అధికారి జి.వేణుగోపాలరావు అన్నారు. – న్యూస్‌టుడే, చీపురుపల్లి

ఎరువు తయారీకి ప్రోత్సాహం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

రాజాం, న్యూస్‌టుడే: ఇంట్లోని కిచెన్ వ్యర్థాలతో ఎరువు తయారు చేసేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు కమిషనర్ జె.రామ అప్పలనాయుడు తెలిపారు. చెత్తశుద్ధి విధానంపై గృహ సముదాయాల వద్ద శనివారం అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువు తయారీకి జ్యూస్ దుకాణాల వద్ద వచ్చే వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరిస్తున్నట్లు వెల్లడించారు. పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

సృజనకు పదును





బొబ్బిలి పట్టణంలోని పొట్టిశ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రతిభా పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జి.లావణ్య(8వ తరగతి), ఎస్కే అహ్మద్(10వ తరగతి), ఎస్.రజని(10వ తరగతి) విజేతలుగా నిలిచారు. ప్రధానోపాధ్యాయుడు కె.జగదీష్‌కుమార్, ఉపాధ్యాయులు బండి రమేష్, శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.వి.ఎల్.ఎన్ సాయిబాబా ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

ఉరకలెత్తిన ఉత్సాహం.. ప్రతిభకు ప్రోత్సాహం





రాజాం పట్టణంలోని సన్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై జరిగిన వ్యాసరచన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పదో తరగతి విద్యార్థులు డి.పూజిత (ప్రథమ), ఎం.ప్రణతి (ద్వితీయ), ఎస్.సాయిశ్రీ చరిష్మ (తృతీయ) స్థానాలు సాధించారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ వై.భారతి, ఉపాధ్యాయులు ఎం.వినోద్‌కుమార్, బి.సంతోష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేసి, అభినందించారు. – న్యూస్‌టుడే, రాజాం

ట్యాంకులు అధ్వానం జలాలు కలుషితం

శుభ్రత నీరు గారుతోంది



ఇది గరివిడి ఉపాధ్యాయ కాలనీలోని తాగునీటి ట్యాంకు. గత కొన్ని నెలలుగా శుభ్రం చేసిన దాఖలాల్లేవని స్థానికులు చెబుతున్నారు. ట్యాంకును శుభ్రం చేసిన తేదీల వివరాలు రాయాల్సిన బోర్డు ఖాళీగా కనిపిస్తోంది.



– న్యూస్‌టుడే, గరివిడి

చీపురుపల్లి నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలకు 4 సీపీడబ్ల్యూ పథకాలు, 128 గ్రామీణ రక్షిత నీటి పథకాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. సీపీడబ్ల్యూ పథకాల ద్వారా క్లోరినేషన్ చేసిన నీరే సరఫరా అవుతోంది. కానీ నిబంధనల ప్రకారం గ్రామీణ పథకాల ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి. శుభ్రం చేసిన తేదీ, తదుపరి శుభ్రం చేయాల్సిన తేదీ తదితర వివరాలను ట్యాంకుల వద్ద నమోదు చేయాల్సి ఉంది. ఎక్కడా శుభ్రం చేసిన ఆనవాళ్లు లేవు. ట్యాంకుల వద్ద బోర్డులు అలంకార ప్రాయంగానే ఉన్నాయి. ఏ విధమైన వివరాలు నమోదు చేయడం లేదు.

చంపావతి నది నుంచి గరివిడి పట్టణానికి నీరందించే పైపులైను ఎప్పటికప్పుడు లీకేజీలతో ఇబ్బంది పెడుతోంది. గరివిడి, చీపురుపల్లి పట్టణాల్లో పలుచోట్ల లీకేజీలుంటున్నాయి. కోనూరు, వెదుళ్లవలస, బుదరాయవలస గ్రామాల కాలువల్లో పైపులైన్లు కనిపిస్తున్నాయి. వెదుళ్లవలస, తోండ్రంగి, గెడ్డపువలస గ్రామాల్లో పంచాయతీల అనుమతులు లేకుండా ఎవరికి వారే ఇష్టానుసారంగా పైపులైన్ల వద్ద గోతులు పెట్టి కుళాయిలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ గోతుల్లో వర్షాలకు వరద చేరి తాగునీరు కలుషితం అవుతోంది.

పైపులైన్ల లీకేజీలు.

పైపులైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఎయిర్ వాల్వ్‌ల వద్ద కూడా తాగునీరు వృథా అవుతోంది. నెల్లిమర్లలో

పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు

గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్లు నాలుగు మండలాల ఎంపీడీవోలు తెలిపారు. గ్రామీణ నీటి పారుదల శాఖ సిబ్బంది, కార్యదర్శులు సమన్వయంతో పని చేసి పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గత నెల 5వ తేదీ తరువాత చీపురుపల్లి పట్టణంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకును శుభ్రం చేయకుండా వదిలేసినట్లు బోర్డులో నమోదు చేసిన వివరాలే చెబుతున్నాయి.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



రిబ్బను కత్తిరిస్తున్న వైద్యులు అప్పారావు, రామకృష్ణ, గోపాలనాయుడు

బొబ్బిలి, న్యూస్‌టుడే: అభిమాని, సుబంధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్యులు కోటగిరి వెంకట అప్పారావు హాజరై మాట్లాడారు. మహిళలకు అన్ని రకాల దుస్తులు కుట్టడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. నేటి రోజుల్లో కుట్లు, అల్లికలకు మంచి డిమాండు ఉందని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు స్వయంశక్తితో ముందుకు వెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఫౌండేషన్ ప్రతినిధులు రెడ్డి రాజగోపాలనాయుడు, కె.రామకృష్ణ అన్నారు. 2023లో 320 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చామన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

గజపతినగరం, మెంటాడ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వేలో రైతులకు తలెత్తిన సమస్యలను గ్రామ సభల్లో వివరించి, పరిష్కారాలు పొందాలని ఆర్డీవో రామ్మోహనరావు అన్నారు. ఎం.గుమడాంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. ఉమ్మడి ఎల్‌పీఎం(మ్యాప్‌లు) ఉన్నాయని రైతులు తెలుపగా, విడదీసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీసర్వే తర్వాత చనిపోయిన వారి పేరున పాసు పుస్తకాలు వచ్చాయని పలువురు రైతులు తెలుపగా, వారసుల పేరుతో పాసు పుస్తకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు బి.రత్నకుమార్, సర్పంచి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మెంటాడ మండలం ఉద్దంగిలోనూ ఆర్డీవో పాల్గొని 43 అర్జీలు అందుకున్నారు.



సూచనలు చేస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

వసతులు లోపిస్తే చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న వై.ప్రేమలత

చీపురుపల్లి, బొబ్బిలి, గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లిలో బీసీ బాలికల, బాలుర కళాశాల వసతి గృహాలను జూనియర్ సివిల్ న్యాయమూర్తి వై.ప్రేమలత శనివారం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు, భోజనంలో నాణ్యత తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. పాఠశాలల్లో వసతులు లోపిస్తే చర్యలు తీసుకుంటామని సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ అన్నారు. బొబ్బిలి పట్టణంలోని ఏపీ గురుకుల, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలను తనిఖీ చేసి, వసతుల గురించి ఆరా తీశారు.

సీబీఎం పాఠశాల ప్రత్యేకాధికారిగా మోహనరావు

బొబ్బిలి, న్యూస్‌టుడే: సీబీఎం బాలికోన్నత పాఠశాల ప్రత్యేకాధికారిగా బొబ్బిలి ఉప విద్యాశాఖాధికారి మోహనరావు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టరు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల కరస్పాండెంటుగా వ్యవహరించిన బి.రత్నకుమార్‌ను తొలగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన 1.20 ఎకరాల భూమి క్రయ, విక్రయాలపై ఐదు నెలలుగా వివాదం నడుస్తోంది. ఈ స్థలాన్ని ఎన్నికలకు ముందు బొబ్బిలికి చెందిన వైకాపా నాయకుడు తూముల భాస్కరరావుకు రత్నకుమార్ విక్రయించారు. బొబ్బిలిలో సీబీఎం స్థలాన్ని భాస్కరరావు తీసుకుని కోమటిపల్లిలో ఆయనకు చెందిన నాలుగు ఎకరాలు(భవనాలతో సహా) స్థలాన్ని భూ బదలాయింపు చేసుకున్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాలు నేటికీ ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. ఈ తరుణంలో రత్నకుమార్‌ను కాదని, ఆయన స్థానంలో ఉప విద్యాశాఖాధికారిని నియమించడం చర్చనీయాంశమైంది.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

బొబ్బిలి	- 80085 74367
గజపతినగరం	- 80085 74332
రాజాం	- 80085 74308
గరివిడి	- 80085 74348

? సిరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు రక్షణ గోడ లేక మూగజీవాలకు నిలయమై పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. - **స్థానికులు**

• సమస్యను పరిష్కరిస్తాం. - **వెంకటరావు, ఎంఈవో-2** –న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? పెణసాంలో తాగునీటి కుళాయి పైపులైన్లకు లీకులు ఏర్పడ్డాయి. - **స్థానికులు**

• లీకులను అరికడతాం. - **నానిబాబు, ఏఈ**

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? రామభద్రపురం మేజరు పంచాయతీ మారుతీ కాలనీలోని కాలువల్లో మురుగు తొలగించాలి.

- **స్థానికులు**

• మురుగు తొలగించడానికి చర్యలు తీసుకుంటాం.

- **శ్రీనివాస్, ఈవో**

– న్యూస్‌టుడే, రామభద్రపురం

ఆలయ ప్రతిష్ఠాపన

రేగిడి, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నయ్యపేట వద్ద విశాఖ పాలకొండ ప్రధాన రహదారి పక్కనే నిర్మించిన ఓంకారేశ్వర సహిత అఖిలాండేశ్వరి ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పూజారులు మండపారాధనలు, విఘ్నేశ్వర పూజలు చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఫిర్యాదుపై విచారణ

బొండపల్లి, న్యూస్‌టుడే: బి.రాజేరు గ్రామంలోని స్వయం సహాయక సంఘాల లావాదేవీల్లో వీవోఏ అక్రమాలకు పాల్పడ్డారని ఎంపీపీ సి.చెన్నారాయుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక వెలుగు ఏపీఎం కె.సులోచనాదేవి శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో అతిసార బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్‌నాయుడు అన్నారు. శనివారం వైద్య శిబిరాన్ని సందర్శించి, రోగులతో మాట్లాడారు. వదంతులు నమ్మి భయపడొద్దని ధైర్యం చెప్పారు.

మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి



రోగితో మాట్లాడుతున్న అప్పలరాజు తదితరులు

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారంతో మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు డిమాండు చేశారు. శనివారం గుర్ల వైద్య శిబిరాన్ని జడ్పీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి సందర్శించారు.

బాధితులను ఆదుకోండి

బొబ్బిలి, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారంతో చనిపోయిన వారి కుటుంబీకులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండు చేశారు. శనివారం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శంకరరావు, టీవీ రమణ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో గాయాలు

చీపురుపల్లి, గ్రామీణం: రహదారి ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. చీపురుపల్లికి చెందిన ఆశయ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై రాజాం వెళ్తుండగా అప్పన్నవలస కూడలి వద్ద ఓ వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మెరకముడిదాం: ఉత్తరావల్లికి చెందిన వై.సుశీల (26) ఈనెల 13న ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ ఒంటికి నిప్పంటుకుంది. తీవ్రంగా కాలిపోవడంతో కుటుంబీకులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి మృత్యువాత

గుర్ల: నాగళ్లవలసలో అనారోగ్యంతో ఒకరు మృతి చెందారు. రెండ్రోజుల క్రితం గ్రామానికి చెందిన బి.సత్యం(48) వాంతులు చేసుకున్నారు. కుటుంబీకులు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సత్యంకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నకుమారి తెలిపారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చంద్రబాబు ఘనతే

రాజాం: అన్న క్యాంటీన్‌లో పూటకు రూ.5కే భోజనం సమకూర్చుతున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని తెదేపా రాజాం పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు టంకాల కన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి శాశపు రమేష్‌కుమార్‌లు పేర్కొన్నారు. వీరు శనివారం రాజాంలోని అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, పరిమాణం పరిశీలించారు. పేదల ఆకలి తీర్చుతున్న అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం తగదని హితవు పలికారు. గార గున్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలదే రాజ్యం

కొండంపేటలో మౌలిక వసతులు కరవు



పేరుకుపోయిన మురుగు



గోతులమయంగా ప్రధాన రహదారి

న్యూస్‌టుడే- రాజాం

రాజాం పట్టణం కొండంపేటలో మౌలిక వసతుల లేమి ప్రజలను వేధిస్తోంది. రహదారులు, మురుగునీటి కాలువలను నిర్మించాల్సి ఉంది. రాజాం- బొబ్బిలి రహదారి నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. శిథిల వ్యర్థాలతో కొన్ని చోట్ల గుంతలను స్థానికులు పూడ్చారు. కాలువలు నిర్మించి వరద వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవిస్తున్నారు. పలు కాలువల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం సమీప కోనేరులో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్ని వీధులకు వెళ్లేందుకు కాలువలపై పలకలు లేవు. పెద్ద బండ రాయి వంటివి ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు.

నిధులు కేటాయించాం

కొండంపేట పరిసర ప్రాంతాల్లో రూ.40 లక్షలతో రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టనున్నాం. మరో రూ.40 లక్షల పనులను కూడా గుర్తించాం. కాలువల్లో చెత్త తొలగిస్తాం.

– జి.రామఅప్పలనాయుడు, కమిషనర్, రాజాం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

గంట్యాడ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గంట్యాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు 11 మంది ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని ఎ.ఝూన్సీ తెలిపారు. వీరు ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నంద్యాలలో జరగనున్న పోటీల్లో పాల్గొనేందుకు పయనమైనట్లు చెప్పారు. బాలికల విభాగంలో పి.మణి, జోత్స్నారాణి, జగదీశ్వరి, ఊహాసుందరి, వర్షిణి, దుర్గాభవానీ, లలితశ్రీ, బాలుర విభాగంలో జి.హేమంత్, ఎస్.రాజు, భాస్కర సూర్యనారాయణ, కె.దిలీప్‌కుమార్ ఎంపికయ్యారని చెప్పారు. పీడీలు పీవీఎస్ఎన్ రాజు, బైరెడ్డి శ్రీను, ఉపాధ్యాయులు క్రీడాకారుల్ని అభినందించారు.

హాకీ క్రీడలో సత్తా

గరివిడి, న్యూస్‌టుడే: కొండలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పీవీ.బాబూరావు, పీడీ పి.రమేష్ తెలిపారు. అండర్-14 విభాగంలో వి.సాత్విక, జి.భాస్కరరావు, సీహెచ్.లోకేశ్, బి.ధనుష్, ఎన్.పూజ, అండర్-17లో ఆర్.శేఖర్, యు.శివ, జి.దుర్గాప్రసాద్, ఎ.రవిరాజు, జి.చైతన్య ఉన్నారన్నారు. • కొండపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ.భానుప్రకాష్ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు ఎం.నిర్మల, పీడీ జి.సూర్యలక్ష్మి తెలిపారు.



గురువులతో విద్యార్థులు

బొబ్బిలి విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన వారితో పీడీ రాజేశ్వరి

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో బొబ్బిలికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చూపారు. పెంట ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లచ్చుపతుల చరణ్‌తేజ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు రమణ అభినందించారు. కోమటిపల్లి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పి.శాంతి, బొబ్బిలి గురుకుల పాఠశాలలో చదువుతున్న వి.రమణ అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఉపాధ్యాయులు, పీడీలు అభినందించారు. ఈనెల 30న అనంతపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

గొల్లపల్లిలో తాగునీటి ఇక్కట్లు



ప్రధాన రహదారిలో శిథిలావస్థకు చేరిన పిట్‌ట్యాపు వద్ద నీరు పట్టుకునేందుకు ఉంచిన బకెట్

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని గొల్లపల్లిలో పురపాలక రక్షిత కుళాయిల వద్ద నీరు పట్టలేని పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ప్రధాన రహదారి, అంబేడ్కర్ కాలనీ, ఎస్సీ కాలనీల్లో చాలా చోట్ల గోతుల్లో దిగి నీరు పట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజులకోసారి తాగునీరు వస్తోంది. ఆపై పిట్‌ట్యాపుల వద్ద బిందెలు ఉంచలేని పరిస్థితి. వజ్జివీధి, పైలవీధి, వీణల కేంద్రం ప్రాంతంలో కుళాయిల నుంచి పూర్తిస్థాయిలో నీరు రావడం లేదని మహిళలు చెబుతున్నారు. 20 నిమిషాల వరకు బురదనీరు వస్తోందన్నారు. మరోపక్క మురుగు కాలువలు పూడికతో నిండిపోయి, దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఎస్సీ కాలనీలోని వీధుల్లో రహదారులు లేవు. తక్షణమే కుళాయిల చుట్టూ పక్కాగా సిమెంటు దిమ్మెలు నిర్మించాలని, కలుషిత నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కుళాయిల చుట్టూ పిట్‌ట్యాపుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పురపాలక ఏఈ రవి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. శిథిలావస్థకు చేరిన వాటిని తొలగించి, కొత్తవి నిర్మిస్తామన్నారు.

విజయనగరం

●విజయనగరం ●నెల్లిమర్ల ●ఎస్.కోట

ప్రతిభ చాటారు





విజయనగరం కొత్తపేట పులిగెడ్డవారి వీధిలోని పల్లవి విద్యామందిర్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 'అంతర్జాల వినియోగంవల్ల లాభనష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డి.సంజన (తొమ్మిదో తరగతి), సీహెచ్.వి.ఎల్.కృతిక (తొమ్మిదో తరగతి), పి.వైష్ణవి (పదో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాల ప్రధానాచార్యుడు ఎస్.శేఖర్, డీన్ సీహెచ్.అనిల్, ఇన్‌ఛార్జి ఎస్.లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు వి.అచ్యుతరావు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

వసతి గృహాల తనిఖీ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని గిరిజన కళాశాల బాలుర, బాలికల, ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహాలను, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా కమిటీ ఛైర్‌పర్సన్ సబ్బవరపు వాణి శనివారం తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వసతిగృహాల్లోని సౌకర్యాలను తెలుసుకునేందుకు ఆమె తనిఖీ చేశారు. సౌకర్యాలు పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

సుందరీకరణ అన్నారు.. సమస్యలే మిగిల్చారు

న్యూస్‌టుడే – విజయనగరం పట్టణం

గత ప్రభుత్వ హయాంలో సుందరీకరణ పేరుతో చేపట్టిన పనులు పూర్తిచేయక నగరవాసులకు సమస్యలే మిగిలాయి. రహదారులు, కాలువలు, వెలగని వీధి దీపాలు, అసంపూర్తి భవన నిర్మాణాలు, ఒరిగిన విద్యుత్తు స్తంభాలు, వేలాడుతున్న తీగలు, అధ్వానంగా ఉద్యానవనాలు కనిపిస్తున్నాయి. కుక్కలు, పందుల బెడద అన్ని ప్రాంతాల్లో ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



స్టేడియంపేటలో నిలిచిన పట్టణ ఆరోగ్య కేంద్రం పనులు

మౌలిక సదుపాయాల కరవు

కామాక్షినగర్ పరిధిలోని ఇందిరానగర్, సంతోషీమాత కోవెల ప్రాంతం తదితర చోట్ల కాలువల వ్యవస్థ లేక మురుగు నీరు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నిలుస్తోంది. మట్టిదారులే ఎక్కువగా ఉన్నాయి. విద్యుత్తు స్తంభం పడిపోయే విధంగా ఉందని, విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

అభివృద్ధికి దూరంగా ఉద్యానవనాలు

నగరంలోని పీఎస్ఆర్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీలోని ఉద్యానవనాలు అభివృద్ధి నోచుకోలేదు. పీఎస్ఆర్ కాలనీ పార్కు నిర్వహణ సరైన వరకు పందులకు నిలయంగా మారింది. డివిజన్ కార్పొరేటరు కౌన్సిల్ సమావేశంలో సమస్యను లేవనెత్తితే గాని పరిష్కారానికి నోచుకోలేదు. ఇక్కడ నాలుగేళ్ల క్రితం పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని రూ.లక్షలు వెచ్చించి నాటిన మొక్కలు కనుమరుగయ్యాయి. ఇదే ప్రాంతంలో మరో పార్కు చిట్టడవిని తలపిస్తోంది. పీఎస్ఆర్, ఎంఎస్ కాలనీల్లో రహదారులు, కాలువలు నిర్మించాల్సిఉంది. కోరాడవీధి, ఎలుగుబంటి వారి వీధి, కోడిగంటివారి వీధుల్లో పురాతన కాలువల వ్యవస్థ ఉండటంతో శుభ్రత పనులు పూర్తిస్థాయిలో జరగడంలేదు. ఐస్ ఫ్యాక్టరీ, ధర్మపురి దారిలో కాలువల ఆక్రమణలకు గురికావడంతో వర్షాలు పడితే ముంపునకు గురవుతోంది.

కుక్కలు, పందుల బెడద..

నగరంలో ఎంఎస్ఎన్ కాలనీ, దాసన్నపేట కొత్తవీధి, రాజీవ్‌నగర్ కాలనీ తదితర చోట్ల నుంచి కుక్కల బెడద ఎక్కువగా ఉందని ఫిర్యాదులు ఉన్నాయి. దాసన్నపేట రిజర్వాయరు దగ్గర నాలుగు లైట్ల హైమాస్ట్ దీపాలు 10 రోజుల నుంచి వెలగడం లేదని స్థానికులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

నిలిచిన ఆరోగ్యకేంద్రం నిర్మాణం


కేంద్ర ప్రభుత్వం నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వ హయాంలో కేంద్రం నిధులు విడుదల చేసింది. ఆ పనులు ఇప్పటికీ పూర్తికాని పరిస్థితి నెలకొంది. నగరపాలక సంస్థ సాధారణ నిధులు మూడు రూ.లక్షల్లో ప్రతిపాదించినా భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో పరిసర ప్రాంత ప్రజలు వైద్యసేవలకు దూరమవుతున్నారు. స్టేడియంపేటలోని ఆరోగ్య కేంద్రం మధ్యలో నిలిపివేయగా, గుత్తేదారు పనులు నిలిపివేయడంతో మళ్లీ టెండర్లు పిలిచి పనులు అప్పగించారు. ప్రస్తుతం నిర్మాణం నిలిచిపోయిన భవనం పశువుల శాల, జూదశిబిరంగా తయారైంది. సాయినాథ్ కాలనీ, స్టేడియం కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో కాలువలు నిర్మించాల్సి ఉంది.



కామాక్షినగర్ పరిధిలో రహదారుల పరిస్థితి

కళాశాలకు సొంత భవనం కేటాయించాలి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని కేటాయించాలని కోరుతూ శనివారం భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఏర్పడి అయిదేళ్లయినా సొంత భవనం లేకపోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేశ్ పేర్కొన్నారు. విద్యార్థులకు అనుగుణంగా గదులు లేకపోవడంతో తరగతులు సరిగా జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంతకాల ప్రతులను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎర్రమ్మ, రాహుల్, సూరిబాబు, మురళి పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పునాదులస్థాయి దాటలే..



డెంకాడ మండలం మోదవలస పంచాయతీ గండిబోయిన కల్లాలు మెట్ట వద్ద జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలు ఇంకా పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇక్కడ మొత్తం 113 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరుచేయగా. . ఇప్పటివరకు పది మంది మాత్రమే నిర్మాణాలు పూర్తిచేశారు. చాలా మంది పునాదుల దశలో వదిలేశారు. దీనిపై గృహనిర్మాణశాఖ డీఈ మురళీమోహన్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. పనులు ప్రారంభించాలని పలుమార్లు లబ్ధిదారులకు సూచించినప్పటికీ ఎవరూ ముందు రావడం లేదన్నారు. జనవరి నాటికి పూర్తిచేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, డెంకాడ

శిథిల భవనం.. ప్రమాదకరం

జామి పీహెచ్‌సీ పక్కనున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల శిథిలావస్థలో ఉంది. భవనం శ్లాబు పెచ్చులూడిపోయి వర్షం పడితే పూర్తిగా కారిపోతోంది. ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. పీహెచ్‌సీకి కొత్తగా నిర్మించిన భవనంలో గది కేటాయించినా.. ఇంకా ప్రారంభంకాకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. దీనిపై వైద్యాధికారి విజయరాజు వద్ద ప్రస్తావించగా.. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లినట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, జామి



మట్టి రోడ్డుతో అవస్థలు



దేశపాత్రునిపాలెం పంచాయతీ శివారు మంగళపాలెం-2 ప్రాంతంలోని శివాలయం వెనుక వీధికి సరైన రహదారి సదుపాయంలేక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం వర్షం వచ్చినా.. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు బురదమయమై పాదచారులు, వాహన చోదకులకు అవస్థలు తప్పడంలేదు. సిమెంటు రోడ్డుగా తీర్చిదిద్ది కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. దీనిపై దేశపాత్రునిపాలెం పంచాయతీ కార్యదర్శి వి.కృష్ణారావు వద్ద ప్రస్తావించగా.. ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంటు రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తవలస

రీసర్వేపై ఫిర్యాదుల స్వీకరణ

కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, న్యూస్‌టుడే: రీసర్వేలో వచ్చిన భూసమస్యల్ని పరిష్కరించడం కోసమే ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసిందని తహసీల్దారు బి.నీలకంఠరావు అన్నారు. శనివారం సుందరయ్యపేట రెవెన్యూలో గ్రామసభ నిర్వహించారు. జాయింట్ ఎల్‌పీఎంలు, మ్యూటేషన్ల కోసం 61 దరఖాస్తులు అందజేశారు. ● లక్కవరపుకోట కూర్మవరంలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ● వేపాడ మండలం నీలకంఠరాజపురంలో 17 వినతులు స్వీకరించినట్లు తహసీల్దారు రాములమ్మ తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు నీలకంఠరావు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

? పీఎస్ఆర్ కాలనీ, కాళీఘాట్ కాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**

● అక్కడ దీపాలు వెలిగే విధంగా చర్యలు తీసుకుంటాం. **- రమణ, లైటింగ్ సూపర్‌వైజరు**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

గుంత పూడ్చివేత

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక హిందూ ప్రాథమిక పాఠశాల నుంచి బాలాజీ మార్కెట్‌కు వెళ్లే దారిలో లీకు నివారణకు తీసిన గుంతను అధికారులు పూడ్చారు. 'ఈనాడు'లో 19న 'తవ్వేసి.. ప్రమాదాలకు వదిలేసి' శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనరు నల్లనయ్య స్పందించి చర్యలు తీసుకున్నారు. ఇంజినీరింగ్ సిబ్బందితో గుంతను పూడ్చివేయించారు.

దీపాలు వెలిగాయ్

విజయనగరం పట్టణం: అలకనందా కాలనీ సాయిబాబా కోవెల నుంచి గోకపేట దారిలో వీధి దీపాలు వెలిగే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలిపారు. లైటింగ్ సూపర్‌వైజరు రమణ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు. ● సమతా మార్గ్ దారిలో వీధి దీపం వేశారు.

మెరుగైన వైద్యానికి డిమాండు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: గుర్లలో డయేరియాతో మృతి చెందుతున్నారని, అధికారులు నిర్లక్ష్యం వీడి బాధితులకు మెరుగైన వైద్యం అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండు చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, జగన్‌మోహన్, బి.రమణ, రాము, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కిందే చదువులు

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల దుస్థితి



అధ్వానంగా కళాశాల పరిసరాలు

న్యూస్‌టుడే–విజయనగరం విద్యావిభాగం

అనుభవజ్ఞులైన అధ్యాపకులు 400 మంది విద్యార్థులున్నా.. విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస వసతులు కరవవడంతో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అయిదేళ్లూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. ఇటీవల ఎమ్మెల్సీ రఘువర్మ, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పరిశీలించి, సమస్యల పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.

ఇదీ పరిస్థితి..

కళాశాలను 2019-20లో ప్రారంభించారు. అప్పట్లో తెదేపా ప్రభుత్వం ఆంధ్రా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అయిదెకరాల భూమిని కేటాయించింది. ఈలోగా ప్రభుత్వం మారడంతో ప్రక్రియ ఆగిపోయింది. సొంత భవనం లేకపోవడంతో తొలుత జూనియర్ కళాశాలలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించారు. 2020-21 నుంచి సంస్కృత కళాశాలలో కొనసాగుతోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 400 మంది చదువుతున్నారు. అరకొర వసతులు, శిథిలభవనాలే వారికి దిక్కవుతున్నాయి. ఆరుబయట, చెట్ల కింద పాఠాలు బోధిస్తున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల చివరి సమయంలో వేణుగోపాలపురం సమీపంలో స్థలం కేటాయించినా.. అడుగులు ముందుకు పడలేదు.

ఏళ్లుగా అవస్థలు..

ప్రస్తుతం 16 గదులకు గానూ 10 అందుబాటులో ఉన్నాయి. శత జయంతి మందిర భవనం శిథిలావస్థలో ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో బోధనకు వినియోగించేవారు. గతంలోనే ఖాళీ చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది మూసేయడంతో వసతి సమస్య జటిలమైంది. ప్రస్తుతం మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఉదయం సంస్కృత కళాశాల విద్యార్థులు వస్తున్నారని ఇన్‌ఛార్జి ప్రధానాచారిణి శుభ తెలిపారు. వేణుగోపాలపురంలో కేటాయించిన స్థలాన్ని అప్పగించలేదని చెప్పారు. సమస్యలను స్థానిక నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



చోడమ్మ అగ్రహారంలో శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే లోకం మాధవి

విజయనగరం గ్రామీణం, పూసపాటిరేగ, వేపాడ, కొత్తవలస, డెంకాడ, జామి, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వ పాలనలో గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. శనివారం విజయనగరం రాకోడు, పినవేమలి, కోరుకొండ, కోరుకొండపాలెం పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ● గ్రామాల్లో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. పూసపాటిరేగ, చోడమ్మ అగ్రహారం, చల్లవానితోట, రెల్లివలస పంచాయతీల్లో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. నాయకులు ఈశ్వర్రావు, శ్రీను, జమరాజు పాల్గొన్నారు. ● వేపాడ మండలం సింగరాయి పంచాయతీలో రెండు సిమెంటు రోడ్ల నిర్మాణానికి సర్పంచి నిరుజోగి వెంకటరావు భూమి పూజ చేశారు. ● కొత్తవలస మేజరు పంచాయతీలోని బలిఘట్టం, రాజపాత్రునిపాలెం తదితర పంచాయతీల్లో రహదారులు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాయకులు కోళ్ల వెంకటరమణ, ఎర్రయ్య రామస్వామి తదితరులు పాల్గొన్నారు. ● డెంకాడ మండలం అమకాం, రఘుమండ, పెదాడ, బంటుపల్లి, పినతాడివాడ, చింతలవలస గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీపీ బి.వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కె.చంద్రశేఖర్ శంకుస్థాపన చేశారు. ● జామి మండలం రామయ్యపాలెం, కుద్దుపాలెం, శిరికిపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.



రాకోడులో ఎమ్మెల్యే అదితి..

తెదేపా విస్తృతస్థాయి సమావేశం

కొత్తవలస: తెదేపా నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం లక్కవరపుకోట పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ సభ్యత్వ నమోదుపై శ్రేణులకు అవగాహన కల్పించడానికి సమావేశం పెట్టినట్లు చెప్పారు.

ఉద్యోగ విరమణ సమయం పెంచాలి

లక్కవరపుకోట: మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.రమేష్‌నాయుడు శనివారం డిమాండ్ చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 11 నెలలే వేతనం చెల్లిస్తున్నారని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

రూ.10 నాణేల పంపిణీ

విజయనగరం అర్బన్: ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో 44 శాఖల్లో 21, 22 తేదీల్లో రూ.పది నాణేలు వినియోగదారులకు పంపిణీ చేయనున్నట్లు ప్రాంతీయ కార్యాలయ అధికారి సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాణేలు చట్టబద్ధమైనవని, ఆర్‌బీఐ ధ్రువీకరించినవని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంఘ భవనం ప్రారంభం

పట్టణం, మయూరీ కూడలి: విజయనగరంలోని స్థానిక పుత్సలవీధిలోని దేవాంగ సంఘ నూతన భవనాన్ని 21న తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాదరావు ప్రారంభించనున్నారని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు ప్రకాశరావు, కొండా లక్ష్మీనరసింహారావులు తెలిపారు.

చర్యలు తీసుకోండి

విజయనగరం వైద్యవిభాగం: గుర్లలో వాంతులు, విరేచనాలతో బాధపడటానికి కారణమైన డయేరియా వ్యాధి అదుపునకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విరిగిపడిన కొండచరియలు

అనంతగిరి గ్రామీణం: కొత్తవలస- కిరండూల్ రైలు మార్గంలో చిమిడిపల్లి సమీపంలో శనివారం రాత్రి కొండచరియలు విరిగి పట్టాలపై పడ్డాయి. దీంతో కిరండూల్ పాసింజర్ రైలును చిమిడిపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపివేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నారు.

కాలుజారి కార్మికుడి మృతి

పూసపాటిరేగ, (భోగాపురం): స్నానానికి వెళ్లి బాత్రూంలో కాలుజారి కార్మికుడు మృతిచెందిన ఘటన భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనుల వద్ద చోటు చేసుకుంది. ఎస్సై పాపారావు వివరాలు మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బ్రిజ్ తుడు (36) శనివారం స్నానానికి వెళ్లి బాత్రూంలో జారిపడి తలకు తీవ్ర గాయమైంది. తగరపువలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో చోదకులకు అవగాహన

శృంగవరపుకోట: పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో తరచూ అత్యవసర సేవలకు విఘాతం కలుగుతుందని ఎస్సై భాస్కరరావు అన్నారు.

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట, నెల్లిమర్ల: పట్టణంలోని సర్వేపల్లి పాఠశాల విద్యార్థులు పి.సూరజ్‌కుమార్, ఎస్.వేదశ్రీ జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని కరస్పాండెంటు సన్యాసిరావు తెలిపారు. ● నెల్లిమర్ల మహాత్మజ్యోతిబాపులే బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు కె.అమూల్య, బి.లలిత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్, బి.అను వాలీబాల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమామోహిని తెలిపారు ● కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థి మజ్జి మణికంఠ జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జ్ఞానశంకర్ శనివారం తెలిపారు.

బాధితులను ఆదుకోవాలి

ఉడాకాలనీ: కూటమి ప్రభుత్వం ప్రజావైద్యాన్ని దయనీయ పరిస్థితిలో గాలికొదిలేసిందని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు, రాజన్నదొర ఆరోపించారు. శనివారం ఛైర్మన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గుర్ల గ్రామంలో అతిసారం బాధితులను ఆదుకోవాలన్నారు.

ఉపకార వేతనాల అందజేత



విజేతలతో డీఎన్.రావు, జీఎస్ఎన్.రాజు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఏటా ఇచ్చే అదితం లక్ష్మణరావు అండ్ శేషమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఉపకార వేతనాలను ప్రొఫెసర్ డీఎన్.రావు శనివారం అందజేశారు. ఇంజినీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న డి.తేజ, ఫోరెన్సిక్ మొదటి సంవత్సరం విద్యార్థిని కంది లావణ్యకు ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలు అందజేశారు. ఇటీవల జాతీయ, రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను సత్కరించారు. జాతీయస్థాయి విజేతలకు రూ.75 వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు రూ.50 వేలు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఛాన్సలర్ జీఎస్ఎన్.రాజు, డీన్లు ఎంఎల్ఎన్.ఆచార్యులు, సన్నీడియోల్, విజయ్‌బాబు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఎంతో ఉపయోగం

మయూరి కూడలి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు తయారుచేస్తున్న వస్తువులన్నీ ఒకేచోట ప్రజలకు దొరకడం చాలా సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ సతీమణి ప్రశాంతి అన్నారు. శనివారం విజయనగరంలో నిర్వహిస్తున్న అఖిల భారత్ డ్వాక్రాబజార్‌ను ఆమె సందర్శించారు. డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.7 కోట్ల మేరకు అమ్మకాలు జరిగాయని తెలిపారు. ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



డ్వాక్రా బజారును పరిశీలిస్తున్న ప్రశాంతి